## మనసున్న కానిస్టేబుల్‌కు ఘన సన్మానం



**రామసముద్రం మార్చి4 ప్రభాతవార్త**

మండల పోలీస్ స్టేషన్ నందు ఐదు సంవత్సరాలు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి రామకుప్పంకు బదిలీ అయిన కానిస్టేబుల్ శ్రీనివాసులును ఎస్పై రవి కుమార్ స్థానిక సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త ప్రాంతంలో కూడా మంచి గుర్తింపు సంపాదించాలని ఆకాంక్షించారు. మండలంలో చేసిన సేవలకు గుర్తింపుగా శాలువాతో ఘనంగా సత్కరించారు.

## విద్యుత్ సేవ చేసిన ఉద్యోగులకు ఘన సన్మానం



విద్యుత్ సిబ్బందిని సన్మానిస్తున్న ఏడి గోవిందరెడ్డి.

**తంబళ్లపల్లె మార్చి 4 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె నియోజకవర్గం లోని తంబళ్లపల్లె, బి కొత్తకోట, ములకల చెరువు, పెద్ద తిప్ప సముద్రం సెక్టార్ లోని 120 అన్ని కేటగిరీలకు చెందిన విద్యుత్ సిబ్బంది చేస్తున్న నిరంతర సేవను గుర్తించి మదనపల్లి విద్యుత్ శాఖ ఏడి గోవిందరెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉదయం విద్యుత్ లైన్మెన్ల దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది మారుమూల గ్రామాలలో సైతం విద్యుత్ అంతరాయం లేకుండా రైతులకు, వినియోగదారులకు అందుబాటులో ఉండి విపత్కర సమయాల్లో సైతం రేయింబవళ్ళు కృషిచేసిన సిబ్బంది పనితీరును కొనియాడారు. భవిష్యత్తులో సైతం విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ రైతులు, వినియోగదారుల మన్ననలు పొందుతూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం సన్మానం పొందిన విద్యుత్ శాఖ సిబ్బంది ఏడి గోవిందరెడ్డిని మూకుమ్మడిగా సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజాసేవ కోసం మీ ఆదేశాలు పాటిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఎఈలు గిరి, రామ లక్ష్మణ్, తంబళ్లపల్లె లైన్ ఇన్స్పెక్టర్ భాస్కర్, నాలుగు సెక్టార్ల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా విద్యుత్ లైన్‌మెన్‌ల దినోత్సవం



లైన్‌మెన్‌ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :**

పట్టణంలోని విద్యుత్ లైన్‌మెన్‌లు మంగళవారం ఘనంగా విద్యుత్ లైన్ మెన్‌ల దినోత్సవాన్ని ఈస్ట్ సెక్షన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈఈ గంగాధరం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్‌కోన సిఎం ఉత్వర్వులు మేరకు ప్రతి ఏడాది మార్చి 4న విద్యుత్ లైన్‌మెన్‌ల దినోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు. విద్యుత్‌లైనెమెన్‌ల దినోత్సవాన్ని పురష్కరించుకొని కేక్‌కట్‌చేసి స్వీట్లు తినిపించుకొన్నారు. విద్యుత్ రంగానికి లైన్‌మెన్‌లు వెన్నుముక లాంటివారని, ప్రజలకు, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందించడంలో చొరవ చూపుతారన్నారు. వారి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ కంచి నాగరాజు, బాలక్రిష్ణ, శేషాద్రి నాగరాజు, రామచంద్రనాయక్, లక్ష్మినారాయణ, కిషోర్, క్రిష్ణప్ప, పుజైల్, రెడ్డికిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనమిత్ర రూ.15వేలు ఇవ్వాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ




నిరసన చేపట్టిన దృశ్యం

**మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :**

ఆటోడ్రవర్లు, ఇతర మోటార్ కార్మికులకు ప్రభుత్వం వాహనమిత్ర కింద వెంటనే రూ.15వేలు ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివ, నియోజకవర్గకార్యదర్శి ముభారక్‌లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర కింద రూ.15వేలు ఇస్తామని, ఆటోలకు జరిమానాలు పెంచే జీఓ నెంబర్లు 21, 31లను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ఇంతవరకు చెప్పిన మాట ప్రకారం చేసిందేమి లేదన్నారు. మున్సిపాలిటి, పంచాయితీల్లో ఆటోలను నిలుపుదల చేయడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఆటో డ్రైవర్లకు ఇంటిస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి తిరుమల, వెంకటేష్, మస్తాన్, గంగులప్ప, బహబూబ్‌బాషా, మస్తాన్‌ఖాన్, జుబేర్‌ఖాన్ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**సిద్దవటం, మార్చి 4, ప్రభాతవార్త:**

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించే విధంగా కృషి చేసి వారికి తోడ్పాటు అందించాలన్నారు. స్త్రీ యొక్క గొప్పదనాన్ని చాటి చెప్పే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం శుభ పరిణామమన్నారు. మహిళలపై లైంగిక దాడులు అరికట్టే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పి.కొత్తపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్లు మౌలాలి, పద్మావతి, ఆరోగ్య కార్యకర్త శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, వరలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.



# సమ్మర్‌స్టోరేజ్, హంద్రీనీవా కాలువల్లో నీటిసరఫరా చేపట్టండి

**మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :**

పట్టణంలో నిరుపయోగంగా ఉన్న సమ్మర్‌స్టోరేజ్‌లు, హంద్రీ-నీవా కాలువల్లో నీటిసరఫరా కోసం చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు మంగళవారం బివైఎస్ నాయకులు పునిత్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువల ద్వారా నీటిని సరఫరా చేసి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో నిలుపుదల చేసి తాగు,సాగుకునీటికి కొరత లేకుండా నీటిని అందించాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు, వలసపల్లెకి చెందిన గుట్టకిందపల్లె వద్ద సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టి ఏళ్ళు గడుస్తున్నా చుక్కనీరు కూడా నిల్వ చేయలేదన్నారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులను పట్టించుకోకపోవడంతో అవి శిధిలావస్థకు చేరుకుంటున్నాయన్నారు. ఇటీవల హంద్రీ-నీవా కాలువలకు సంబంధించి నాయకులకు, అధికారులకు ఫిర్యాదు చేయగా కాలువలను వెడల్పు చేయాలని పనులు పూర్తయ్యాక నీటిసరఫరా జరుగుతుందని తెలిపారు. హంద్రీనీవా కాలువ ద్వారా నీరు సమ్మర్‌స్టోరేజ్‌కు సరఫరా చేసి, నీటి ఎద్దడి లేకుండా ప్రజలకు, రైతులకు సాగుచేయడానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. సమ్మర్‌స్టోరేజ్‌లు, హంద్రీనీవా కాలువలపై నిర్లక్ష్యం వహించకుండా నీటిసరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని పునీత్ పేర్కొన్నారు. లేనిపక్షంలో రైతులతో కలసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బివైఎస్ నాయకులు జిలాని, శ్రీనివాసులు, ఆది, నవీన్, జగదీష్, ద్వారకా, నవీన్, ఉదయ్, జశ్వంత్, కిరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

# భూ వివాదాల సమస్యల పరిష్కారానికి కృషి

### అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయ సమీక్ష సమావేశం






**కడప మార్చి 4 ప్రభాతవార్త:**

రెవెన్యూ, అటవీ శాఖల నడుమ భూ వివాదాల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూం మీటింగ్ హాల్లో అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయ సమీక్ష సమావేశం డీఎఫ్ఓ వినీత్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, అటవీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లాలోని కాశినాయన జ్యోతి క్షేత్రం, రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్, ఎన్ హెచ్ ఏ ఐ, అటవీ నిర్మూలన పెండింగ్ పరిహారం, సి కె దీన్నే వంటి వివిధ రకాల భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ ,అటవీ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. అటవీ,రెవెన్యూ శాఖల సరిహద్దు సమస్యలు,భూ ఆక్రమిత వివాధాల వంటి సమస్యలను పరిస్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డిఓ సాయి శ్రీ, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, కడప సబ్ డీఫ్ ఓ స్వామి వివేకానంద, ప్రొద్దుటూరు సబ్ డీఫ్ ఓ దివాకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చలో పిఠాపురం గోడ పత్రాలు

**రాజంపేట అర్బన్, మార్చి 4 ప్రభాతవార్త**

ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఎల్లటూరి శ్రీనివాసరాజు ఆవిష్కరించారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జనసేనపార్టీ ఆవిర్భావం నుండి అభివృద్ధి వరకు తోడు ఉన్న ప్రతి ఒక్కరు ఈ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మార్చి 14న పిఠాపురం చిత్రాడలో జరగనున్న జనసేన 12 వ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. జనసైనికులు, వీరమహిళలు అందరూ హాజరై కలిసికట్టుగా పండగ జరుపుకుందామని పిలుపునిచ్చారు.

## గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి

**దువ్వూరు, మార్చి 04, ప్రభాతవార్త:**

మండలంలోని గుడిపాడు సెక్టర్‌లోని చింతకుంట పంచాయతీలో గల చింత కుంట2 అంగన్వాడి సెంటర్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకొని సూపర్వైజర్ జి.సౌజన్య గర్భవతులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు పోషకవిలువలు కూడినటువంటి ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యవంతమైన ప్రయోజనాలు మరియు యోగ, మెడిటేషన్ వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి మరియు మొత్తం శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చాలా అవసరము అన్నారు. యోగ చేయడం వల్ల శారీరక బలం పెరుగుతుందని, ఒత్తిడిని తగ్గిస్తుందనీ మీరు మీకోసం ఆరోగ్యకరమైన, సంతోషకరమైన భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకుంట1 సచివాలయం పంచాయతీ సెక్రటరీ రాంగోపాల్ రెడ్డి, గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, చింతకుంట పంచాయతీ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



# కిచెన్ కింగ్ మసాల



**ఫలానా మసాలాపొడి వల్ల కూరసూపర్‌గా ఉంది లాంటి ప్రకటనలు చూస్తుంటాం కదా! అలాంటి వాటిల్లో 'కిచెన్ కింగ్ మసాలా' ఒకటి .** ఇది బయట కొనేకంటే ఇంట్లోనే చేసుకుంటే మరిత తాజాగా ఉంటుంది. ప్రిజర్వేటివ్స్ ఉండవు కనుక ఆరోగ్యానికీ మంచిది. తేలిగ్గా ఎలా చేయాలంటే.. మినపప్పు, పచ్చి శనగ పప్పు, షాహీ జీరా, ఆవాలు ఒక్కో చెంచా చొప్పున, మెంతులు పావు చెంచా,3 సోంపు 2 టేబుల్ స్పూన్లు ధనియాలు 3 టేబుల్ స్పూన్లు, ఒకటిన్నర చెంచా జీలకర్రలను సన్న సెగ మీద వేయించాలి. అవి గోధుమ రంగులోకి మారేసరికి మంచి వాసన వస్తుంది. అందులో అంగుళ చొప్పున దాల్చినచెక్క,శొంఠి, మూడు బిర్యానీ ఆకులు, 12 లవంగాలు, 8 యాలకులు, 2 నల్ల యాలకులు (బ్లాక్ కార్డమమ్), ఒక జాపత్రి, ఒక స్టార్ మొగ్గ, అర జాజికాయ, 7 ఎండు మిరప కాయలు, అర టేబుల్‌స్పూన్ గసగసాలు, 2 టేబుల్ స్పూన్ల చొప్పున మిరియాలు, మెంతి ఆకులు పొడి వేసి ఇంకాస్త వేయించాలి. మంచి సువాసన వస్తున్నప్పుడు దించేచాలి. అవి చల్లారాక..చెంచా చొప్పున పసుపు, ఉప్పు, ఆమ్‌చూర్ పొడి జతచేసి గ్రైండ్ చేయాలి. అంతే.. 'కిచెన్ కింగ్ మసాలా' సిద్ధం. దీనినన తడ లేని గాలి చొరబడని డ్బాలో భద్ర చేసుకుంటే టామాటో, బంగాళదుంప లాంటి కూరల దగ్గర నుంచి బిర్యానీ వరకూ ఎందులో వేసినా వారెవా అనిపిస్తుంది.

# సిసి కెమరాలపై ప్రజలకు సర్పంచ్ చలపతి అవగాహన

**మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :**

పట్టణంలోని కురువంక గ్రామ ప్రజలకు స్థానిక సర్పంచ్ పసుపులేటి చలపతి సిసి కెమరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమానికి సిఐ కళా వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ దొంగల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ళకు తాళాలు వేసి ఊర్లకు వెళ్ళేటప్పుడు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్ళకు, దుకాణాలకు సిసి కెమరాలు అమర్చుకోవడం ద్వారా చోరీలకు పాల్పడే దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. సిసి కెమరాలు ప్రతి ఒక్కరూ అమర్చుకొని దొంగల బారినుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సిఐ వెంకటరమణ, సర్పంచ్ చలపతి, పోలీస్ సిబ్బంది, చిప్పిలి హరి, చిప్పిలి క్రిష్టారెడ్డి, నక్కలదిన్నె మేస్త్రీ శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, పోలీసులు

# గాదె గెలుపు ఉపాధ్యాయులకు మలుపు

**లక్కిరెడ్డిపల్లి : మార్చి 04 ప్రభాతవార్త**

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో అధికార ప్రతిపక్ష పార్టీలు మద్దతు కోరకుండా పి.ఆర్.టి.యు యూనియన్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి వివిధ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో మూడుసార్లు గెలిచి తన సత్తా చాటుకున్న గాదె శ్రీనివాసులు నాయుడుకు పి.ఆర్.టి.యు అన్నమయ్య జిల్లా పక్షాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూడే సూర్యుడు నాయక్, శిపాల ఉమామహేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ సిద్దు నాయక్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ గెలుపు ఇటు సంఘ శ్రేయసుకు సమస్యల సాధనకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. దీనితో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల వెంటనే దృష్టి సారించాలని 9 నెలలుగా తమ సమస్యలు ఏవీ పరిష్కారం కాకపోవడంతో నే ఉపాధ్యాయులు ఫలితాన్ని ఓట్ల రూపంలో చూపించారని కొనియాడారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేలుకొని అత్యధిక పెయిడ్ జాబుగా ఉపాధ్యాయులను చూడాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ చూపి త్వరగా కమిటీతో కాలయాపన చేయకుండా పి ఆర్ సి ని ప్రకటించి మరో చరిత్ర సృష్టించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ నందు డిఎ బకాయిలకు గాని సరెండర్ లీవ్ ఎన్కాష్మెంట్ నకు నిధులు కేటాయించకపోవడమే ఈ వ్యతిరేకతను నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ప్రభుత్వ హయాంలో ప్రకటించిన పిఆర్సి కి తగ్గకుండా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని పరిష్కరించి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పక్షపాతి ప్రభుత్వంగా నిరూపించుకోవాలని ప్రభుత్వాన్ని సూచించారు.



## రూపరాజు శకుంతలమ్మ మృతి బాధాకరం

### నివాళులర్పించిన పలువురు



**బద్వేల్ అర్బన్ మార్చి 04 ప్రభాతవార్త :**

ప్రముఖ న్యాయవాది వార్త జాతీయ దిన పత్రిక లీగల్ రిపోర్టర్, రూపరాజు చంద్రశేఖర్ తల్లి రూపరాజు శకుంతలమ్మ (80) సోమవారం మృతి చెందారు, విషయం తెలుసుకున్న నూమర్స్ వెంకటేశ్వరరావు, రూపరాజు మధుసూదన్ రావు, ప్రైవేట్ సర్వేయర్ రూపరాజు శ్రీనివాసరావు, రిటైడ్ ఉపాధ్యాయుడు శేష పని, తోపాటు పలువురు మీడియా సోదరులు వారి బంధుమిత్రులు పలువురు మృతి చెందిన శకుంతలమ్మ భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు, మంచితనానికి మారుపేరుగా ఉంటూ అందరిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న శకుంతలమ్మ అకాల మరణం బాధాకరమంటూ వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని నూమర్స్ వెంకటేశ్వరరావు తో పాటు పలువురు ఘన నివాళులర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలియజేశారు

## జాతీయ స్థాయికి ఎంపికైన శ్రీనలంద విద్యార్థులు

**సిద్దవటం, మార్చి 4, ప్రభాతవార్త:**

స్థానిక శ్రీనలంద పాఠశాల నుంచి ఐఐటీ జేఈఈ నీట్ ఫలితాలలో జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచారని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అనుగుణంగా గత 9 సంవత్సరాల నుంచి పాఠశాల స్థాయి నుంచి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఈ పాఠశాల నుంచి అనేక మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక బహుమతులు కూడా సాధించారని గుర్తు చేశారు. అలాగే ఈ విద్యా సంవత్సరం ఆల్ ఇండియా మ్యాథమేటిక్స్ అండ్ సైన్స్ ఒలంపియాడ్ వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పోటీలలో శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు 8వ తరగతికి చెందిన ఎస్.తేజశ్రీ జోన్ స్థాయి 8వ ర్యాంకు సాధించగా 5వ తరగతికి చెందిన పి.ప్రవీణ రాష్ట్ర 3వ ర్యాంకు సాధించారన్నారు. ఈ ఇద్దరు విద్యార్థులు ఈనెల 9వ తేదీ ఆదివారం హైదరాబాదు రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని బహుమతులు అందుకుంటారన్నారు. ఇంతటి ఘన విజయాలు సాధించడంలో తమ పాఠశాల ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారంతోనే సాధ్యమయ్యాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శివ, వైశాలీ, లక్ష్మీ నారాయణమ్మ, ప్రమీల, ఉపాధ్యాయులు విద్యార్థినిలను అభినందించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**గాలివీడు, మార్చి 4(ప్రభాతవార్త):**



పట్టణంలో భిక్షాటన చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి కడప రిమ్స్ హాస్పిటల్‌లో మృతిచెందాడని ఆచూకీ తెలిసిన వారు పోలీసులు దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గాలివీడు పట్టణం గేటు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ మతిస్థిమితం లేక వీదుల్లో తిరుగుతుండేవాడన్నారు అయితే అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు స్పష్టం చేశారు. మృతుడికి సంబంధించిన వారు గానీ బంధువులు గానీ గుర్తు పట్టి వెంటనే గాలివీడు ఎస్ఐ 9121100556 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## టి బంకు యజమాని ఆకస్మిక మృతి

**రైల్వే కోడూరు మార్చి 4 ప్రభాతవార్త**

పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు సమీపంలో ఉన్న టి బంకు యజమాని గడ్డి మందు తాగి ఆసుపత్రి పాలైనట్టు పలువురు స్థానికులు తెలిపారు. అయితే సోమవారం ఉదయమున కొన్ని మనస్పర్ధలు,అప్పుల వారి వేధింపులతో దగ్గరున్న గడ్డి మందును త్రాగినట్లు టి బంకులో ఉన్న కొంతమంది విలేకరులకు తెలిపారు. అయితే ఈ మందు ఎందుకు తాగారో అర్థం కాని స్థితిలో స్థానికులు ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ కొంత నగదును వేరే వారి వద్ద నుండి తీసి ఇతరులకు ఇచ్చిన సందర్భంలో వారు తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తావం చెంది గడ్డి మందులు తాగినట్టు స్థానికులు తెలిపారు. అయితే మందు తాగిన విషయాన్ని స్థానికులు చూసి హుటాహుటి తిరుపతిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

## విచారణకు సంసిద్ధం..

**కడప కార్పొరేషన్ మార్చి 4 ప్రభాతవార్త:**

సైనిక డిపార్ట్మెంట్ సంబంధించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రయత్నిస్తున్నానని, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి కాపాడే ప్రయత్నం చేశానని జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, జిల్లా మాజీ సైనిక బోర్డు నెంబర్ కెవి.రావు అన్నారు. మంగళవారం కడపలో విలేకరులతో వారు మాట్లాడుతూ కడప ఆర్టిసి బస్టాండ్ సమీపంలోని సైనిక డిపార్ట్మెంట్ సంబంధించిన స్థలం కోసం పోరాడుతుంటే నాపైన దుష్ప్రచారం చేస్తున్నారని, అసత్య నిందా ఆరోపణలు చేస్తున్నారన్నారు. సైనిక పెన్షనర్ అసోసియేషన్ నాయకుల సవాల్ ను స్వీకరిస్తూ బహిరంగ విచారణకు సంసిద్ధమన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి, పోలీస్ అధికారులు, పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.


**RAYACHOTY MUNICIPALITY**
**'ap eprocurement Tender Notice'**

Rc.No.1624/2020/E1 Dt.04.03.2025

| Sl.No. | Name of the Grant | No.of works |
|---|---|---|
| 1 | 15th Finance Commission Grant for the year 2022-23 (2nd Installment) (Un-tied) & 2023-24 (1st Installment) (Un-tied) | 25 |

Contact:Municipal Assistant Engineer, Rayachoty Municipality
Further details can be seen **www.apeprocurement.gov.in**
Bid document download start date & time : 04.03.2025@10.00 AM
Bid document download end date & time : 21.03.2025@ 4.00 PM
Bid submission closing date & time : 21.03.2025@ 4.30 PM

**Sd/- COMMISSIONER**
**RAYACHOTY MUNICIPALITY**

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**Municipal Administration Department**
**BADVEL MUNICIPALITY**

| Sl.No. | e-Procurement Notice | Name of Grant | Number of Works | Estimate Contract Value (In Lakhs) |
|---|---|---|---|---|
| 1 | 16 to 18/2024-25/E1 | Balance Special Development Fund | 3 | 23.01 |
| 2 | 19to 25/2024-25/E1 | General Fund | 7 | 29.82 |
| 3 | 26/2024-25/E1 | 15th FCG | 1 | 8.75 |
| | TOTAL | | 11 | 61.58 |

Bid document download Start Date & time 06.03.2025 05.00 PM
Bid document download End Date & time 20.03.2025 05.00 PM
Bid submission closing Date & time 20.03.2025 05.30 PM
Contact : Further details can be seen @e-procurement market place at https://www.tender.apeprocurement.gov.in
Contact : Deputy Executive Engineer (8179611207), Commissioner (9959555838)

**Commissioner**
**Badvel Muncipality**

# ప్రీ స్కూల్ చిల్డ్రన్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న పిడి రమాదేవి

పీలేరు మార్చి 4 ప్రభాతవార్త :

పూర్వ పాఠశాల విద్యార్థుల మానసిక, శారీరక, విద్యార్థి కోసం అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. రమాదేవి తెలిపారు. మంగళవారం పీలేరు పట్టణం, ఆర్టీసీ నల్లగుట్టలోని అంగన్వాడి కేంద్రాన్ని పిడి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు పట్టిని, వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆటపాటలతో చిన్నారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలిసిన మీడియాతో ఆమె మాట్లాడుతూ అన్నామయ్య జిల్లాలో మొత్తం 2,275 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో 1,858 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు, 417 మినీ అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయన్నారు. అందులో 1,030 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 795 కేంద్రాలు అద్దె భవనాల్లో, 450 కేంద్రాలు ఉచిత భవనాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 9,260 మంది గర్భిణీ స్త్రీలు, 8,323 మంది చనుబాలు పట్టే తల్లులు అంగన్వాడి సెంటర్ల ద్వారా పౌష్టికాహారం, ఇతర సేవలు అందుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా 7 నెలల పసికందు నుంచి 3 సంవత్సరాల వయస్సు పిల్లలు 53,022 మంది, 3 నుండి 6 సంవత్సరాల వయస్సు బాలులు 42,037 మంది అంగన్వాడీ కేంద్రాలకు హాజరై పౌష్టికాహారాన్ని స్వీకరిస్తూ, పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారని తెలియజేశారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా అందిస్తూ వారి మానసిక, శారీరక, ఆరోగ్య అభివృద్ధికి తమ సిబ్బంది పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ రాజమ్మ, సూపర్వైజర్ స్వరూప, అంగన్వాడి వర్కర్లు అఖిల, అనిత, సహాయకులు, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

రామసముద్రం మార్చి4 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బజారు వీధిలో కొలువై ఉన్న అతిపురాతన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బటర్ ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అర్చనలు, పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణలతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి దర్శనం ముకున్న భక్తులకు ఆలయ అర్చకులు కులశేఖర్ బటర్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## సారామాని చదువుకొని సెల్యూట్ చేయించుకోండి



ప్రమాణం చేయిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి.

తంబళ్లపల్లె మార్చి4 ప్రభాతవార్త :

గిరిజనులు నాటు సారా మాని చక్కగా చదువుకొని ఉద్యోగం సంపాదించి సంఘంలో గౌరవంగా బతికి సెల్యూట్ చేయించుకునే స్థాయికి ఎదగాలని కడప ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తంబళ్లపల్లె మండలం కోటకొండ గిరిజన తండాలో ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి ఆధ్వర్యంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి సమాజంలో నాటు సారా ప్రాణాంతకమని దాని ఆదాయం తో హీనంగా బతికే కన్నా గౌరవంగా తలెత్తుకొని స్వతంత్రంగా స్వేచ్ఛ జీవితం గడపాలని సూచించారు. జిల్లా కలెక్టర్ తో సంప్రదించి జీవనోపాధికి సహకరిస్తానని హామీ ఇచ్చి వారి చేత సారా అమ్మమని గిరిజనులతో మూకుమ్మడి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, తాసిల్దార్ హరికుమార్, ఏవో థామస్ రాజా, సర్పంచ్ శంకర్ నాయక్, ఎక్సైజ్ ఎస్సై వై బాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనాథరెడ్డి, సిబ్బంది నాగరాజు, చాంద్ భాష, విఆర్ఓ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మిట్స్ విద్యార్థులకు వర్క్ షాపులపై సదస్సు

కురబలకోట, మార్చి 4 ప్రభాతవార్త



మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మిట్స్) కళశాల నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ( ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగము వారు మూడు రోజుల వర్క్షాప్ ను ఏ.ఐ అండ్ ఏం.ఎల్ ప్రోడక్ట్ డెవలప్మెంట్ పై వర్క్షాప్ ను నిర్వహించినారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సురేష్ కన్నయన్, ఫౌండర్ అండ్ డైరెక్టర్ , మెన్మోళి టెక్నాలజీస్, AJ పాల్గొన్నారు. కార్యకమంలో ఆయన మాట్లాడుతూ ఏఐ మరియు ఏం.ఎల్ మధ్య తేడాలు, డేటా సైన్స్ పరిచయం, మోడల్స్ ట్రైనింగ్ ప్రాసెస్, మరియు పైథాన్‌లో అవసరమైన ప్యాకేజీల ఉపయోగంపై విద్యార్థులు అవగాహాన పెంచుకోవాలన్నారు. డేటా సేకరణ, ప్రాసెసింగ్, మరియు ఎక్సప్లోరింగ్ డేటా అనలిటిక్స్ (EDA) ద్వారా విద్యార్థులతో చిన్న ప్రాజెక్ట్‌లను చేయించడం జరిగింది. కార్యక్రమంలో విభజ్గాధిపతి డాక్టర్ పద్మ, కో ఆర్డినేటర్ శాయిజ్ అహమ్మద్ తదితరులు పాల్గొనారు.

## మహిళలు ఆటలలోనూ రాణించాలి

కడప కార్పొరేషన్ మార్చి 4 ప్రభాతవార్త:



మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, క్రీడలలో కూడా రాణించాలని కడప జిల్లా యన్జివో అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, జియన్ ప్రిన్సిపాల్ రోడా మెర్సీ, యమ్ పి డి, తరుణ్, నగేష్ అన్నారు. మంగళవారం కడప జియోన్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షులు నిర్మల జోతి, కన్వినర్ భారతి ల మహిళలకు టెన్ని క్యాట్, లెమన్ అండ్ స్పూన్, త్రో బాల్, కబడ్డీ, వాలి బాల్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు కృష్ణ కుమారి, జానకి, పద్మజ, లక్ష్మి, ప్రమీల జోతి, ఏ కె పద్మ, అరుణమ్మ, గాయిత్రి, చందన, సంగీత, స్వర్ణలత, రోజా, నాయకులు నిత్యపూజయ్య, శ్రీనివాసులు, సైలేశ్వర్ రెడ్డి, నాగార్జున, పద్మనాభం, రాయచోటి యన్జివో సెక్రటరీ డి. వెంకటేశ్వర్ రెడ్డి, రాయచోటి బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఆర్.జయచంద్ర మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## గొర్రెలు మేకల పెంపకం దారులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

పీలేరు మార్చి 4 ప్రభాతవార్త :



ధర్నా విజయవంతం చేయాలని పిలుపు

గొర్రెల మేకల పెంపకం దారులకు జీవనోపాధి నిమిత్తం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని గొర్రెల మేకల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ బాబు డిమాండ్ చేశారు ఈ మేరకు మంగళవారం పీలేరు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంసం ఉత్పత్తిలో కీలకంగా మారిన వీరిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు గ్రామీణ ప్రాంతాల్లోని ఈ పెంపకం దారులు గొర్రెల మేకల మేత కోసం వలస పోతున్నారని ఇలాంటి వలసలు అరికట్టే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గొర్రెల మేకల పెంపకం దారులకు ప్రభుత్వం పావలా వడ్డీతో రూ.5 లక్షల వరకు బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పించాలని ఆయన అన్నారు .వీటికి మేత తాగునీరు సౌకర్యం కల్పించడంతోపాటు సంచార వాహనాల ద్వారా వైద్యం అందించాలని వీటిని సంరక్షించేందుకు అన్ని విధాల ప్రభుత్వం సహకారం అందించాలని ఆయన కోరారు ఈ డిమాండ్లతో ఈ నెల 10వ తేదీన విజయవాడలో తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని నారాయణ బాబు పిలుపునిచ్చారు రమేష్ కృష్ణయ్య నరసింహులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆశ వర్కర్ల సమావేశం

సుండుపల్లె, మార్చి04, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మండల ఆశా వర్కర్ల సమావేశాన్ని వైద్యాధికారి ఫర్హానా ఖానం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పార్హానా మాట్లాడుతూ నెలలో ఒకసారి ఆశా డే ఉంటుందని ఇందులో భాగంగా కాన్పుల వివరాలు బాలింతలు, గర్భవతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు,పౌష్టిక ఆహార లోపం లేకుండా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి గర్భవతులు, బాలింతలకు అవగాహన పెంచలన్నారు ,షుగర్,బీపీతో పాటు క్యాన్సర్ స్కానింగ్ మరియు పాఠశాల విద్యార్థుల వివరాలను పూర్తి చేయాలన్నారు, టీబి ఉన్న రోగాలను గుర్తించి, హాస్పిటల్ కి వచ్చి మందులను వాడించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ నోడల్ అధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్వైజర్ వెంకటరమణ, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు

## పంచాయతీ కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

పీలేరు మార్చి 4 ప్రభాతవార్త: :



పంచాయతీ కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు 2024,25 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన జూలై, డిసెంబర్ మొదటి విడత వారికి ఇవ్వాల్సిన బట్టలు, సోపులు, నూనె, బట్టలు, బ్లౌజ్ లాంటి నిత్యవసరాలు కార్మికులకు అందజేసిన పంచాయతీ ఈవో వై,గురు మోహన్ టిడిపి నాయకులు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల కష్టం మరువ లేనిదని పట్టణం, వీధులు, మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచడం బాధ్యతగా పనిచేస్తూ 115 మంది కార్మికులు ప్రజారోగ్యాలు కాపాడుతూ బాధ్యతగా పనిచేస్తున్న వారికి మొదటి విడత ఇవ్వవలసిన నిత్యావసరాలు మొత్తం అందజేశారు.వారి సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ కార్యదర్శి పురం రామ్మూర్తి పీలేరు పట్టణ అధ్యక్షులు దలవాయి సురేష్ కుమార్ రెడ్డి (కంచి సూరి) సానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ ఒలంపియాడ్‌లో ఉషాకిరణ్ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లి, మార్చి 04, ప్రభాతవార్త :



ఆర్కే ఎడ్యుటెక్ సొల్యూషన్స్ సంస్థ రాయలసీమ జోనల్ స్థాయిలో నిర్వహించిన అబాకస్ ఒలంపియాడ్‌లో ఉషా కిరణ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఎ కేటగిరి విభాగంలో ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన 1వ తరగతి విద్యార్థి ఎల్. హేమంత్, రెండవ తరగతి విద్యార్థి ఎం. శివ కార్తీక్ జోనల్ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించినట్లు చేశారు. రెండవ తరగతి విద్యార్థిని జి వెంకట భవ్య శ్రీ, నాలుగవ తరగతి విద్యార్థిని కె. వైష్ణవి తృతీయ స్థానాన్ని సాధించి నిర్వాహకుల నుండి జ్ఞాపికను, సర్టిఫికెట్ ను పొందినట్లు కరస్పాండెంట్ తెలియజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయినులు జి .శివజ్యోతి, ఎన్. మల్లీశ్వరి, పి కళ్యాణిలను కరస్పాండెంట్ అభినందించారు.

## ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

పీలేరు మార్చి 4 ప్రభాత వార్త :

పీలేరు నియోజకవర్గం లో ఏపీ ఫుడ్క మిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి గురువారం పర్యటిస్తున్నట్లు పీలేరు తహసిల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పీలేరులో మాట్లాడుతూ చౌక దుకాణాలు అంగన్వాడీ కేంద్రాలు ,పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## తిరుమలకు 6వ మహా పాదయాత్ర

సుండుపల్లె, మార్చి 04, ప్రభాతవార్త:



6 వ తిరుమల మహా పాదయాత్రను రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా వింగ్, చిన్న గొల్లపల్లి సర్పంచ్ రామా జయచంద్ర మంగళవారం ప్రారంభించారు. మంగళవారం ఉదయాన్నే చిన్న గొల్లపల్లి గ్రామ సమీపంలోని మర్రిచెట్టు దగ్గర ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి సంవత్సరం తిరుమల వెంకటేశ్వస్వామికి కాలినడకన పోయి మొక్కుబడి తీర్చు కొంటామని తెలియజేసారు. గురువారం శ్రీవారి మెట్లు మార్గం ద్వారా తిరుమలకు చేరుకుని స్వామివారి దర్శనం చేసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా జాతీయ లైన్‌మెన్ దినోత్సవం

పులివెందుల రూరల్, మార్చి 04, ప్రభాతవార్త :



పులివెందుల పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో మంగళవారం జాతీయ లైన్మెన్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా విద్యుత్ కంపెనీ సంస్థ ఎస్ఈ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ రమణ మాట్లాడుతూ ఇలాంటి జాతీయ లైన్మెన్ దినోత్సవం జరుపుకోవడం చాలా గర్వకారణం అని, ముఖ్యంగా విద్యుత్తు సంస్థలు పనిచేసే ప్రతి ఒక్క లైను ఇన్స్పెక్టర్, లైన్మెన్‌ల సేవలు అమోఘమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంజనీర్ ప్రసాద్ రెడ్డి, ఏడిఈ గురు మోహన్ రెడ్డి, ఏడిఈ సుధాకర్ రెడ్డి, ఏడి నాగేంద్ర, ఏఈ జగదీష్ రెడ్డి, సబ్ ఇంజనీర్, లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్ , తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



చిన్నమండెం, మార్చి 4 ప్రభాతవార్త :

రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని టిడిపి నాయకులు మోర్య రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం మండలం టౌన్ లో టిడిపి నాయకులు మోర్యరెడ్డి నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుత వేసవికాలంలో ప్రజలకు నీరు సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రాధాన్యత క్రమంలో అవసరమైన ప్రతి గ్రామంలో బోర్లు వేసి పైపులైన్ల ద్వారా గ్రామాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలో శాశ్వత నీరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి




ముద్దనూరు, మార్చి 4, ప్రభాతవార్త:

మండలంలోని బొందలకుంట రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతు నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఏఓ వెంకట కృష్ణారెడ్డి పరిశీలించి తదుపరి బడుగువారిపల్లె మరియు అరవేటిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంది పంట సాగు చేసిన రైతులు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలి అన్నారు. ద్రవ జీవామృతం, తయారు చేసే విధానం గురించి పని చేసే విధానం గురించి వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకం లబ్ధి పొందాలి అంటే ఈకేవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి అన్నారు.అలాగే రైతు నమోదు కానీ రైతులు వెంటనే ఆర్ యస్ కె సిబ్బందిని సంప్రదించి రైతు నమోదు కూడా పూర్తి చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకుడు ప్రశాంత్ కుమార్, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది రామ సుధ, ముని భూపాలుడు, నుజహత్, పుష్పావతి, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నాలుగు మండలాల కమిటీలు ఎన్నిక



ఎన్నికైన నాలుగు మండలాల కమిటీ నాయకులు

పోరుమామిళ్ల రూరల్, మార్చి 4ప్రభాతవార్త:

మాల మహానాడు జి చెన్నయ వర్గం జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచ నాగ మల్లేశ్వరి ఆదేశాల మేరకు కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్, ముత్యాల ప్రసాద్ రావు నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో కడప జిల్లాలో మాల మహానాడును బలోపేతం చేయడానికి పోరుమామిళ్ల మండలంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నాలుగు మండలాల నూతన కమిటీలు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు జే కిరణ్, బి కోడూరు మండల అధ్యక్షులువిజయరావు, కాశినాయన మండలం అధ్యక్షులు. విజయ్, కలసపాడు మండలం పి.రాజా,బద్వేల్ డివిజన్ జాయింట్ సెక్రెటరీ రాఘవేంద్ర, జిల్లా మాల మహానాడు యువజన అధ్యక్షులు పి రాజేష్, కలసపాడు మండల ఉపాధ్యక్షులు జాన్ బాబు, బి.కోడూరు ఉపాధ్యక్షులు ఎలీషా, పోరుమామిళ్ల ఉపాధ్యక్షులు మహేష్. పోరుమామిళ్ల కార్యదర్శి బాబు, పోరుమామిళ్ల వికలాంగుల అధ్యక్షులు చిన్న బద్వేల్ గౌరవ అధ్యక్షులు చెంద్రాయుడు, టిడిపి ఎస్సీ సెల్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు బండి ఓబులేసు, వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కె బాబు, మానవ హక్కుల జిల్లా ఉపాధ్యక్షులు వి.రాజులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహాసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపత్, కే.రాబర్ట్ రాజు, బి.సురేష్, శంకరయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోరుమామిళ్ల పట్టణ అభివృద్ధి తమ లక్ష్యం



మాట్లాడుతున్న మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్

పోరుమామిళ్ల రూరల్, మార్చి 4ప్రభాతవార్త:

పోరుమామిళ్ల పట్టణంలోని మెయిన్ బజార్లో రోడ్డు డివైడర్లు ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికుల ద్వారా పరిశుభ్రపరచినట్లు పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ తెలిపారు. ఇరువైపులా ఉన్న షాపుల యజమానులు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను డివైడర్లలో వేయరాదని సూచించారు. అవి వేయడం ద్వారా కలుషితమై అనారోగ్యాలకు దారితీస్తుందన్నారు. చెట్లను నాటినప్పుడు చెట్ల పెరుగుదల తగ్గిపోతున్నారు. పోరుమామిళ్ల పట్టణ అభివృద్ధి తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పట్టణంలో ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు.

## జాతీయ రహదారి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

పోరుమామిళ్ల రూరల్, మార్చి 4ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వ నిధులతో మైదుకూరు టు సింగరాయకొండ 167 బి జాతీయ రహదారి పనులను మంగళవారం బిజెపి నాయకులు పరిశీలించారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారోజు రమణాచారి మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో జాతీయ రహదారి పనులు శరవేయంగా జరుగుతున్నాయని, ఈ రహదారి అమలులోకి వస్తే ప్రయాణ భారం, ప్రయాణ దూరం చాలా తగ్గుతుందన్నారు. భారతదేశంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని కోరుకునేది భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అని తెలియజేశారు. పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర మాట్లాడుతూ ఇలాంటి ప్రయోజనాలు చేకూరుస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీకి నరేంద్ర మోడీకి మనమంతా వెన్నుదన్నుగా నిలవాలని కోరారు.

## కేంద్రీయ విద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తా

### బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్



కేంద్రీయ విద్యాలయం తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడుతున్న సాయి లోకేష్

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

కేంద్రీయ విద్యాలయంలోని సమస్యలను పరిష్కరించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ తెలియజేశారు. పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రుల వినతి మేరకు ఆయన మంగళవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది కొరత ఉన్నట్లు తల్లిదండ్రులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సాయి లోకేష్ ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ కమిషనర్ నిధి పాండేను చరవాణి ద్వారా సంప్రదించి సమస్యను మెయిల్ ద్వారా తెలియజేయగా, త్వరలోనే ఉపాధ్యాయులను నియమించి సమస్యను పరిష్కరిస్తానని నిధి పాండే హామీ ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పాఠశాలలోని 16 మంది బాలికలు జాతీయస్థాయికి ఎంపికై రాజస్థాన్‌లో ఆడటం జరిగింది అని ఉపాధ్యాయ బృందం సాయిలోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. వారికి శిక్షణ కొరకు సరైన ఆటస్థలం లేదని, కేంద్రీయ విద్యాలయంకు పక్కనే ఉన్న జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వారికి శిక్షణ కొరకు అనుమతి మంజూరు చేస్తే విద్యార్థినిలు జాతీయస్థాయిలో రాణించి పాఠశాలకు, రాజంపేట ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తీసుకువస్తారని కోరారు. వెంటనే స్పందించిన సాయి లోకేష్ ఆట స్థలం అనుమతి కొరకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఉపాధ్యాయులు, బిజెపి నాయకులు కృష్ణ యాదవ్, సుబ్బరాయుడు, రమణ, ప్రసాద్ రెడ్డి, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పథకంపై అవగాహన



బద్వేలు అర్బన్, మార్చి 4, ప్రభాతవార్త

బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో గల రిక్షా కాలనీలో మంగళవారం మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి పర్యటించారు. ఈ మేరకు అనధికార ఆక్రమణ స్థలలోని ఇళ్ల క్రమబద్ధీకరణ పథకం, 2025 ద్వారా రెగ్యులరైజ్‌పై అక్కడివారికి అవగాహన కల్పించారు. క్రమబద్దీకరణకు వివరాలు తెలియజేస్తూ 15.10.2019 తేది నాటికి అనధికార ఆక్రమణ స్థలంలో నివాస గృహం నిర్మించి నివసిస్తూ ఉండాలనీ, కుటుంబంలోని మహిళా సభ్యురాలు మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. లబ్ధిదారుని కుటుంబం లేదా కుటుంబంలోని ఏ సభ్యుడైనా రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ మునుపటి ఏ గృహ నిర్మాణ పథకంలోనూ కవర్ చేయబడి ఉండకూడదనీ అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా సొంత ఇల్లు/ఇంటి స్థలం ఉండకూడదన్నారు . ఈ పథకం కింద ఎవరైనా వారి కేటాయింపు ఉత్తర్వులను పొందినట్లయితే, అటువంటి లబ్ధిదారులు తమకు కేటాయించిన నివాస యూనిట్‌ను ఇంటి స్థలం ఫిక్రయించి నట్లయితే అందుకు వారు అనర్హులు అన్నారు. 300 చదరపు గజాలపై బడిన నివాస గృహాలకు బేసిక్ వేల్యూ మరియు రిజిస్ట్రేషన్ వేల్యూలో తగు నిష్పత్తి ప్రకారం చార్జీలు చెల్లించవలెనన్నారు.

## భాష్యంలో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



మదనపల్లెకైం, మార్చి 4 ప్రభాతవార్త :

భాష్యం విద్యాసంస్థలో పట్టభద్రుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మంగళవారం భాష్యం జోనల్ ఇన్చార్జ్ లక్షణ్ ఆదేశాల మేరకు యూకెజి, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రాధిక మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యాభ్యాసం చేయాలన్నారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ వుండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలను తెలియజెయాలన్నారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. బి కొత్తకోట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకు ఆకర్షితులై క్రమశిక్షణకు దూరమవుతున్నారన్నారు. మొబైల్ ఫోన్లను విడనాడి రోజు ఆటపాటల్లో పాల్గొంటే శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ దుర్గాప్రసాద్, చామ్స్ ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులు భర్తీకి ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రమణ

పెద్దమండెం మార్చి 4 ప్రభాతవార్త

మండలంలోని నామినేటర్ పదవులు మార్కెట్ యార్డ్ సింగల్ విండో టెంపుల్ చైర్మన్ ల పదవులకు అభ్యర్థులను ఎంపిక చేయాలని జోనల్ ఫోర్ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి మాజీ ఎమ్మెల్యే జి శంకర్ యాదవ్‌కు అధిష్టానం ఆదేశించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని టిడిపి మండల అధ్యక్షుడు గిట్టా వెంకటరమణ సోమవారం మండలంలోని టిడిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించి అభ్యర్థులు ఎంపికకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు జి శంకర్ లెటర్ ప్యాడ్‌పై అభ్యర్థులను నామినేటర్ పదవులకు ఎంపిక చేసి అధిష్టానానికి పంపాలని ఆదేశించారని అన్నారు దీంతో మండలంలో టిడిపి నాయకుల సమావేశం నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసినట్లు మండల అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ తెలిపారు

## మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు

ముద్దనూరు, మార్చి 4,ప్రభాతవార్త:



జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం ముద్దనూరు మండల ప్రజా పరిషత్ సభా భవనంలో ఎండిఒ ముకుందరెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మహిళ ఆరోగ్యము మరియు మహిళా సంతోషము గురించి ఎంపీడీవో మహిళలందరికీ తెలియజేశారు. మహిళల ఆరోగ్యము, ఆహారము గురించి సిడిపిఒ ముంతాజ్ బేగం మహిళలకు అవగాహన కలిగించడం జరిగింది. చిరుధాన్యాలతో తయారుచేసిన వంటల స్టాల్ ను సందర్శించారు. ఈ సమావేశానికి మండల అభివృద్ధి అధికారి మరియు ఏపీఎం అపర్ణాదేవి సూపర్వైజర్ మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# సచివాలయాల్లో మెరుగైన ఆధార్ సేవలు అందించాలి

### పిల్లల ఆధార్ నమోదు శాతాన్ని పెంచాలి... ఆధార్ నమోదులో తప్పుల శాతం తగ్గాలి



**రాయచోటి మార్చి 4 ప్రభాతవార్త**

జిల్లాలో ఆధార్ నమోదు శాతం పెంచేందుకు అధికారులు అందరూ సమన్వయంగా కృషి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి మధుసూదన్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిఆర్ఓ అధ్యక్షతన జిల్లాస్థాయి ఆధార్ సమీకరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ స్టేట్ రీజనల్ కార్యాలయ సహాయ మేనేజర్ కే దామోదర్ జిల్లాలో ఆధార్ నమోదు ప్రగతి, 0, 5 పిల్లల నమోదు, మొబైల్ బయోమెట్రిక్ యూనిట్లు, నమోదు సందర్భంగా తిరస్కరణకు గురవుతున్న అంశాలు, సాంకేతిక సమస్యలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో సచివాలయాలు, పోస్ట్ ఆఫీస్ లు, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్ మరియు ఇతరత్రా మొత్తంగా 212 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయన్నారు. సచివాలయాలు, పోస్ట్ ఆఫీస్, బ్యాంకులలో ఆధార్ నమోదు శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయాల్లో ఆధార్ సేవలు మెరుగు పరచాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. 05 వయసున్న పిల్లల నమోదు లో దాదాపు 28 వేలకు పైబడి పెండింగ్ ఉన్నాయని వీటన్నింటినీ నమోదు అయ్యేలా కృషి చేయాలన్నారు. అదేవిధంగా కాలేజీలు ఇంజనీరింగ్ కళాశాలలో కూడా మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. జిల్లాలో కెవిపల్లి, తంబళ్లపల్లి, వీరబల్లిలలో ఆధార్ కేంద్రాలు లేవని, అక్కడ కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకులు ముందుకు రావాలని సూచించారు. ఆధారు నమోదు సమయంలో తప్పులు లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి ఆధార్ ను అప్డేట్ చేసుకోవాలని ఈ మేరకు ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు జిఎస్డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, డీఈవో సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ ఇంచార్జి అధికారి రమాదేవి, ఎల్ డి ఎం ఆంజనేయులు, జిఎస్డబ్ల్యూఎస్ అధికారులు, వివిధ బ్యాంకర్లు, పోస్టల్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట, బద్వేలు సబ్ జైళ్లు విజిట్

**కడప లీగల్, మార్చి 4, ప్రభాతవార్త:**

ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ రాజంపేట మరియు బద్వేలు సబ్ జైళ్లు మంగళవారం విజిట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించి అనంతరం ప్రసంగిస్తూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలిపారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే రాజంపేట మండల న్యాయ సేవా సమితిని, బద్వేలు మండల న్యాయ సేవా సమితిని, మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడపను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మరియు బద్వేలు సబ్ జైలు సూపరింటెండెంట్లు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

## ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్

**కడప లీగల్, మార్చి 4, ప్రభాతవార్త:**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

## మహల్ ఆసుపత్రిలో రోగుల గొంతు ఎండుతోంది..!

- స్పందించని అధికార యంత్రాంగం

**కలికిరి, మార్చి 4, ప్రభాతవార్త:**

మండలంలోని మహల్ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండా కాలం కావడం, ఎండ తీవ్రత రోజు రోజుకు పెరగడంతో మంచినీటి కోసం రోగులు, రోగుల బంధువులు, ఆసుపత్రి సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. మహల్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న రక్షిత మంచినీటి బోరులో ఉప్పు రావడం నీరు తాగేందుకు ఉపయోగపడకపోవడంతో ఆసుపత్రిలో మంచినీటి సమస్య తలెత్తింది. మహల్‌లో చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత ప్రజలకు కలికిరి, కేవీ పల్లి, కలకడ, గుర్రంకొండ మండలాల ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలనే ఉద్దేశడంతో గతంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆసుపత్రి మంజూరు చేయించడంతో పాటు రూ.4కోట్ల నిధులతో భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో రోజుకు 200 మందికి పైగా రోగులు చికిత్స కోసం ఓపీకి వస్తున్నారు. ఆసుపత్రిలో కాన్పులు సైతం జరుగుతున్నాయి. ఆసుపత్రికి ప్రభుత్వం మంజూరు చేసే అరకొర నిధులు సరిపోక వైద్యాధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని మహల్ పంచాయతీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అలాగే అద్దెవారిపల్లె పంచాయతీ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేదని ఆసుపత్రికి వచ్చే రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రికి కొత్త బోరు మంజూరు చేసి మంచినీటి సమస్యను అరికట్టాల్సి ఉంది.

## ముగిసిన పోలేరమ్మ జాతర



**గాలివీడు, మార్చి 4(ప్రభాతవార్త):**

మండల కేంద్రంలోని శెట్టివారిపల్లెలో గత రెండు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ జాతర మంగళవారం అసాదుని కథతో ముగిసింది. సద్దలకూడు నైవేద్యంతో జాతరకు అంకురార్పణ చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణల మధ్య భక్తులు విశేష పూజలు, అభిషేకాలు, చాందినీబండ్ల గ్రామోత్సవంతో నిండు తిరుణాలగా మారింది. మంగళవారం ఉదయం స్త్రీలు మూకుమ్మడిగా మొక్కుల రూపంలో బోనాలను సమర్పించుకున్నారు. విద్యుత్ కాంతులతో అలంకరించిన చాందినీబండ్లు, కోలాటాలు, చెక్కభజనలు, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## బేటి బచావో భేటీ పడావో

**చాపాడు. మార్చి 4. ప్రభాతవార్త.**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని చియ్యపాడు గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అందించవలసిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం పై, తడి,పొడి చెత్త విభజన వంటి అంశాలపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి రాధాకృష్ణవేణి, సిడిపిఒ, ఐసిడిఎస్ సూపర్వైజర్ శుభరత్నమ్మ, పంచాయతీ సర్పంచ్ వెంకట శివప్రసాద్, అంగన్వాడీలు శ్రీదేవి, సరస్వతి, సచివాలయ సిబ్బంది, గ్రీన్‌అంబాసిడర్స్ పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారం కొరకు మంత్రికి విన్నపం



**రాయచోటి మార్చి 4 ప్రభాతవార్త**

విజయవాడలోని సచివాలయం మంత్రి ఛాంబర్ లో మంగళ వారం మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ ని వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈఓ బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు వారి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు.

## పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



తృణధాన్యాల ప్రయోజనాన్ని వివరిస్తున్న సిడిపిఒ.

**చిట్వేలి,మార్చి 4, ప్రభాతవార్త:**

బలవర్ధకమైన పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చిట్వేలి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ నిర్మల జ్యోతి అన్నారు. మంగళవారం భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా తృణధాన్యాలతో చేకూరే ప్రయోజనాలను మండల ఐసిడిఎస్ కేంద్రంలో ప్రదర్శించారు. సిడిపిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల ఆహారాన్ని తల్లి బిడ్డలకు విధిగా అందించాలని సిబ్బందికి సూచించారు. శారీరిక, మానసిక ఎదుగుదలకు బాల్య దశ అత్యంత కీలకమన్నారు. ఆటపాటలతో పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించాలన్నారు. చిట్వేలి, పెనగలూరు మండలాల నుంచి పాల్గొన్న 144 మంది అంగన్వాడి సిబ్బందితో కలిసి యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. తదుపరి రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం లో బాగంగా సిబ్బందికి పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్స్ విజయ కుమారి, సురేఖ రాణి, విశాలాక్షి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువుల ద్వారా 10 ఎకరాలకు నీరు అందించేందుకు కృషి

: ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



**బద్వేలు ,మార్చి 4, ప్రభాతవార్త :**

వైసీపీ ప్రభుత్వంలో చెరువులను అభివృద్ధి చేయకపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోయారని కూటమి ప్రబుత్వంలో చెరువుల ద్వారా ప్రతి ఎకరానికి నీరు అందించేందుకు కృషిచేస్తామని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం విజయవాడలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాలలో ప్రతి ఎకరా సాగునీరు రాక భూములు బీడుగా మారాయని వైసీపీ ప్రభుత్వం చెరువులకు నీరు అందించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువులపై దృష్టిపెట్టి ప్రతి ఎకరానికి నీరు అందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి, ఇరిగేషన్ శాఖాధికారులతో చర్చించడం జరిగిందన్నారు. బద్వేలు ప్రాంతంలో వర్షాభావం తక్కువ ఉన్న నేపథ్యంలో వర్షాకాలంలో శ్రీశైలం, ఇతర జలాశయాలనుంచి వచ్చే నీటిని నిల్వ చేసుకుంటే తప్ప లేకుంటే రైతులు ఇబ్బందులు పడతారని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వాటి ద్వారా పంట కాలువలకు నీరు అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. బద్వేలు పెద్ద చెరువుకు బ్రహ్మంసాగర్ నుంచి ఎల్ఎస్‌పీ కాలువ ద్వారా చెరువుకు నీరు నింపాలని కోరారు. ఈ ప్రభుత్వంలో చెరువుల అభివృద్ధికి కృషిచేయాలని ప్రత్యేక నిధులద్వారా మరమ్మతులు చేపట్టాలని అధికారులు కృషిచేశారు. వీరి వెంట ఎల్ఎస్‌పీ డ్యాం ఛైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజిఈఏ డైరీ ఆవిష్కరణ

**బద్వేలు, మార్చి 4, ప్రభాతవార్త**

పట్టణంలోని ఏ ఎస్ డబ్ల్యూ ఓ కార్యాలయంలో మంగళవారం ఏ ఎస్ డబ్ల్యూ ఓ రామయ్య ఆధ్వర్యంలో ఏపీ జిఏ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు తాలూకా ఏపీజీఈఏ ప్రెసిడెంట్ హుస్సేనయ్య, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీదేవి, సుభాష్ చంద్ర, శివ శంకరయ్య, జగన్మోహన్ రావులు తదితరులు పాల్గొన్నారు.



## ఆడపిల్లలను చదివిద్దాం ఆడపిల్లలను రక్షిద్దాం



**బద్వేలు అర్బన్, మార్చి 4, ప్రభాతవార్త**

డాక్టర్ జె వినయ్ కుమార్ మెడికల్ ఆఫీసర్ ప్రైమ్ హెల్త్ సెంటర్ తొట్టిగారిపల్లి. మార్చి 4 వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టి గారిపల్లి నందు మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో ఆశ సమావేశము జరపడమైనది. ఈ సమావేశం లో డాక్టర్ జె.వినయ్ కుమార్ మెడికల్ ఆఫీసర్ వారు మాట్లాడుతూ 3 మార్చి 2025నుండి 8 మార్చి 2025 తారీకు వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు జరుపుకోవాలని ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పేర్కొనడమైనది.ఈ వారోత్సవాల్లో మహిళలు ముఖ్యంగా స్త్రీలు మానసికంగా శారీరకంగా ఎటువంటి పోషకాహారము లోపాలు లేకుండా ఆరోగ్యం పైన శ్రద్ధ వహించాలని,అదేవిధంగా దేశంలోనూ రాష్ట్రంలోనూ బాలికల నిష్పత్తి తగ్గుతున్నందువలన రాష్ట్ర ప్రభుత్వము భారత ప్రభుత్వం వారు బాలికల యొక్క ప్రోత్సాహకాలను గురించి ఆడపిల్లను రక్షిద్దాం ఆడపిల్లను చదివిద్దాం,బాల్య వివాహాలను అరికట్టాలి,పూర్వస్థకు లింగ నిర్ధారణ జరగకుండా హాస్పటల్ పై నిఘా ఉంచాలని,ఆడపిల్లలను ఎదిగినిద్దాం ఆడపిల్లను చదివిద్దాం, బాల్య వివాహాలను అరికట్టాలనే నినాదంతో ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టిగారిపల్లె పరిధిలో ర్యాలీలు సమావేశాలు జరపడమైనది.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి. వెంగయ్య,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. చంద్రావతి మరియు హెల్త్ సూపర్వైజర్ కె వెంకటమ్మ అంగన్వాడి సూపర్వైజర్ అంగన్వాడి కార్యకర్తలు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఏ.ఎన్.ఎం ఆశా కార్యకర్తలు పాల్గొనడం అయినది.

## వ్యవసాయం, పర్యాటకం, మైనింగ్‌లపై దృష్టి సారించాలి



**రాయచోటి మార్చి 04 ప్రభాత వార్త**

అన్నమయ్య జిల్లాను స్వర్ణ అన్నమయ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లాలో బలమైన రంగాలైన వ్యవసాయం, పర్యాటకం, ఉద్యానవనం, మైనింగ్ లపై దృష్టి సారించాలని నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్లో అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా అన్నమయ్య జిల్లా జిడిపీని ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే అంశంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల జిడిపిలో అన్నమయ్య జిల్లా ర్యాంకు 23గా ఉందని దీనిని అభివృద్ధి పరచాలని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో బలమైన రంగాలైన వ్యవసాయం, ఉద్యానవనం, మైనింగ్, పర్యాటకం వంటి రంగాలపై దృష్టి సారించి జిడిపి ని పెంపొందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించి బలాలు, బలహీనతలు, అవకాశాలు, సవాళ్లపై నివేదికను రూపొందించుకొని బలాలపై దృష్టి సారించి అవకాశాలను వినియోగించుకొని వినూత్న ఆలోచనలతో జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత పోలీసుల బాధ్యత



**సిద్దవటం, మార్చి 4, ప్రభాతవార్త:**

మహిళల భద్రత పోలీసుల బాధ్యత అని ఏఎస్సై సుబ్బరామచంద్ర అన్నారు. మండలంలో చాముండేశ్వరీపేట వద్ద ఉన్న వాసవీ ఫార్మసీ కళాశాలలో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఒంటిమిట్ట సీఐ టి.బాబు పర్యవేక్షణలో ఇన్‌ఛార్జి ఎస్సై శివప్రసాద్ సూచనలతో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్సై సుబ్బరామచంద్ర మాట్లాడుతూ మహిళల ఆత్మ రక్షణ కోసం పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని మహిళలు పని చేస్తున్న ప్రదేశాలలో ఏమైనా సమస్యలుంటే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రత, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన విద్యార్థుల సైన్స్ ఫెయిర్



**సిద్దవటం, మార్చి 4, ప్రభాతవార్త:**

150 వర్కింగ్ మోడల్ ప్రాజెక్ట్స్‌తో విద్యార్థుల సైన్స్ ఫెయిర్ చూపరులను అలరించింది. మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేట బ్రాహ్మణవీధిలోని శ్రీ సాయి హైస్కూలు నందు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని హైస్కూలులో అపుస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, ప్రైమరీ స్కూలులో కడప శ్రీనివాస ఆసుపత్రి అధినేత బైన శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఇందులో పాఠశాలలోని విద్యార్థులు దాదాపు 150 వర్కింగ్ మోడల్ ప్రాజెక్ట్స్‌తో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో ప్రముఖంగా హైడ్రాలిక్ బ్రిడ్జ్, డే నైట్ అమెరికా అండ్ ఇండియా వర్కింగ్ మోడల్, సీజన్స్, వాటర్ ప్యూరిఫికేషన్, రైన్ వాటర్ హార్వెస్టింగ్, బజర్ గేమ్, మైక్రోస్కోప్, కూలింగ్ సిస్టం, హార్ట్, బ్లడ్ సర్కులేషన్, అడవులను నరకడం వల్ల వచ్చే నష్టాలు, సోలార్ సిస్టం, యూజెస్ ఆఫ్ నట్స్ లాంటి అనేక రకాల ప్రాజెక్టులతో చూపరులను అలరించారు. అలాగే పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని దేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జరుపుకుంటామన్నారు. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ తన పరిశోధనా ఫలితాన్ని ధ్రువీకరించిన రోజు ఫిబ్రవరి 28వ తేదీ అన్నారు. దీంతో ఆ రోజునే నేషనల్ సైన్స్ డే గా జరుపుకోవాలని 1987లో భారత ప్రభత్వం ప్రకటించిందన్నారు. భారత గడ్డపైన చదువుకొని, తలమానికమైన పరిశోధనలు జరిపి సైన్స్‌లో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన మేధావి రామన్ అని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది శివశంకర్‌రెడ్డి, మాజీ ఏపీపీ శివశంకర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ రేవతిదేవి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నమాచార్యలో ఘనంగా కోడ్‌జెన్ 2కె 25 కోడింగ్ పోటీలు



**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం కోడ్‌జెన్ 2కె 25 కోడింగ్ పోటీని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో కోడింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం. ఇటీవల ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు కోడింగ్‌లో ప్రావీణ్యత ఉన్న అభ్యర్థులకు అధిక పారితోషికంతో ఉద్యోగ అవకాశాలు అందిస్తున్న నేపథ్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కోడింగ్‌పై ఆసక్తిని పెంచడం ఈ పోటీ లక్ష్యం. ఈ పోటీలో మొత్తం 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక రౌండ్ల అనంతరం ఎనిమిది మంది ఫైనల్ రౌండ్‌కు ఎంపికయ్యారు, చివరగా ముగ్గురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ప్రథమ బహుమతులు గెలుచుకున్న విద్యార్థుల్లో ఎస్. సయ్యద్ బాషా, రాణా సందర్, షైక్ రియాజ్ బాషాలున్నారు. ఈ ముగ్గురు విజేతలకు అన్నమాచార్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. ఈ. సాయిబాబా రెడ్డి, రిజిస్ట్రార్ డా. ఎన్. మల్లికార్జునరావు, అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. ఎస్.ఎన్.వి. నారాయణ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. ఎం. సుబ్బారావులు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థులు కోడింగ్‌లో మెళకువలను నేర్చుకుని తాజా పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తమను తాము అభివృద్ధి చేసుకోవాలని విశ్వవిద్యాలయ అధికారులు సూచించారు. భవిష్యత్తులో మరిన్ని కోడింగ్ పోటీలు నిర్వహించి, విద్యార్థులకు ఉత్తమ వృత్తి అవకాశాలను అందించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు.

## బంజారా హోళీ సంబరాల పోస్టరు ఆవిష్కరన



**కడప కార్పొరేషన్ మార్చి 4 ప్రభాతవార్త:**

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14 వ తేదీన కడపలో శిల్పారామం దగ్గరలోని గిరిజన భవన్ లో జరగబోయే బంజారా హోళీ సంబరాల పోస్టర్‌ను మంగళవారం కడప జిల్లా ఎస్పీ ఈజి. అశోక్ కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. బంజారాలు ఉన్నత చదువులు చదివి గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. తాండ వాసులకు చైతన్య పరిచి సమాజంలో కలిసిపోయి వ్యాపార, వ్యవసాయం వంటి వాటి పైన శ్రద్ధ చూపించి ఆర్థికంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్. శివా నాయక్ మాట్లాడుతూ కడప జిల్లాలోని ప్రతి బంజారా కుటుంబం హోళీ సంబరాల్లో పాల్గొని జయప్రదం చేసి బంజారాల ఐక్యత ను చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగన్ రాథోడ్, రాష్ట్ర కార్యదర్శులు మూడే వెంకటస్వామి నాయక్, అర్జున్ నాయక్, ఢాకే నాయక్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం



**బ్రహ్మంగారి మఠం: మార్చి 04 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల విద్యాలయం నందు 2025,26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి మరియు ఇంటర్ ఫస్టియర్ చేరుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి. ఉమా మహేశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని అంబేద్కర్ గురుకులం నందు ఐదో తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందుటకు ఆసక్తిగా ఉన్న విద్యార్థులు దరఖాస్తును ఆన్లైన్ ద్వారా మార్చి ఆరవ తేదీ లోపు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఏప్రిల్ ఆరో తేదీ ఉదయం ఐదో తరగతికి మధ్యాహ్నం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని వారు తెలిపారు.పూర్తి వివరాలకు 8309399642 నెంబర్ ను సంప్రదించగలరని వారు తెలిపారు .ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల సిబ్బంది వాసిరెడ్డి మూర్తి, బొల్లు రామ్మోహన్, గురురత్నం, ప్రవీణ్, అశోక్ కుమార్, ఉపేంద్ర, సత్యం పాల్గొన్నారు.

## ఐసిడిఎస్‌లో మహిళా దినోత్సవ వారోత్సవాలు



మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :**

మదనపల్లెలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆహా పదార్థాలు, చిరుధాన్యాలు, పౌష్టికాహారం, బాల్య వివాహాల నిర్మూళనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు ఆపిన తరువత బాలికలు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో తెలుసుకొని బాధ్యత కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిరుధాన్యాల ఎగ్జిబిషన్, ఆహార పదార్థాలు తయారీ వంటివేకాకుండా యోగ ట్రైనర్ సునీత యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**రైల్వే కోడూరు మార్చి 4 ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖ ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న అర్చకులను ప్రభుత్వ ఉద్యోగులుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కమిటీ సలహాదారు బండా త్మకూరు సుదర్శన్ శర్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖకు ఏటా కోట్లాది రూపాయలు ఆదాయం ఆలయాల అర్చకుల వలన వస్తున్నట్లు ఆయన అన్నారు. దేవాలయ శాఖలో అర్చకులు తప్ప ఇతర విధులు నిర్వహించే వారందరూ ప్రభుత్వ ఉద్యోగులుగా జీతాలు పొందుతున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఏళ్ల తరబడి దేవాదాయ శాఖ అర్చకులకు అరా కొర వేతనాలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆలయాల అర్చకలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు ఇవ్వాలని సుదర్శన్ శర్మ డిమాండ్ చేశారు.